శిలువగిరి తిరునాళ్ల చూతము రారండి..!

- గుణదల తిరునాళ్ల తరువాత ప్రాచుర్యం పొందిన శిలువగిరి
- ఏటా పెరుగుతున్న భక్తుల సంఖ్య
- మూడు రోజులపాటు మహోత్సవాలు
- రేపటి నుంచి ప్రారంభం కానున్న తిరునాళ్ల



విద్యుత్ దీపాలతో అలంకరించిన కొండపై చర్చి



కొండ దిగువ భాగంలో ఏర్పాటుచేసిన మరియ మాత విగ్రహం

నందిగామ: గుణదల తిరునాళ్ల తరువాత ఈ ప్రాంతంలో ఆ స్థాయిలో ప్రాచుర్యం పొందిన మహోత్సవాలు శిలువగిరి పుణ్యక్షేత్ర తిరునాళ్ల మహోత్సవాలు. ఏటా మూడు రోజులపాటు ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఊరికి దూరంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో సమైక్యత శిఖరంగా పిలుచుకునే పల్లగిరి కొండపై చర్చి, మరియ మాత విగ్రహం ఆధ్యాత్మికతకు, ప్రశాంతతకు ప్రతీకగా నిలుస్తాయి. రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచిన గుణదల మాత తిరునాళ్ల తరువాత ఆ స్థాయిలో శిలువగిరి తిరునాళ్ల మహోత్సవాలు జరుగుతాయి.

మూడు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న ఉత్సవాలు

నందిగామ మండలంలోని 11 గ్రామాల్లోని ఆర్‌సీఎం సంఘాలను కలిపి శిలువ గిరి విచారణ పరిధిలో చేర్చారు. ఇందుకోసం నందిగామ పట్టణ శివారుల్లోని పల్లగిరి కొండ వద్ద 1985లో ప్రత్యేకంగా చర్చి నిర్మించి విచారణ గురువును నియమించారు. కేరళకు చెందిన కె.జె.ఆంటోని తొలి విచారణ గురువుగా బాధ్యతలు చేపట్టారు. ఆయన ఆలోచనల ఫలితంగానే శిలువగిరి పుణ్యక్షేత్రం రూపుదిద్దుకుంది. తొలుత కొండపై చర్చి నిర్మాణంతోపాటు దాని దిగువన మరియ తల్లి కోసం ప్రత్యేకంగా గుహ నిర్మించి అందులో మరియ మాత విగ్రహం ప్రతిష్ఠించారు. అప్పటి నుంచే మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో విచారణ పరిధిలోని ఏటిపట్టు గ్రామాలకు చెందిన పలువురు ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానును కలసి ఉత్సవాలు నిర్వహించేందుకు కొండను అభివృద్ధి చేయాలని కోరడంతో ఆయన స్పందించి, భక్తులు కొండ పైకి చేరుకునేందుకు అనుకూలంగా దారి ఏర్పాటు చేయించడంతోపాటు ప్రత్యేక దివ్య బలి పూజ, కూడికలు, సాంస్కృతిక ప్రదర్శనల కోసం కొండపై కొంత ప్రాంతాన్ని చదును చేయించారు. అనంతర కాలంలో క్రీస్తు శిలువ మరణం పొందిన సమయంలో అనుభవించిన శ్రమల్లోని ముఖ్య ఘట్టాలను వివరిస్తూ, శిలువమార్గం నిర్వహించుకునేందుకు అనువుగా 14 స్థలాలను ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా గుడ్ ఫ్రైడే రోజు ఇక్కడ శిలువ మార్గం నిర్వహిస్తారు.

దూర ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులు

శిలువగిరి తిరునాళ్లకు ఏటా భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఆరంభంలో విచారణ పరిధిలోని గ్రామాలకు చెందిన భక్తులతోపాటు నందిగామ పట్టణానికి చెందిన వారు మాత్రమే తిరునాళ్లకు వచ్చే వారు. రాను రాను భక్తుల సంఖ్య క్రమేపీ పెరుగుతూ వచ్చింది. పలు జిల్లాలతోపాటు పొరుగున తెలంగాణ రాష్ట్రంలోని మధిర, ఎర్రుపాలెం మండలాల నుంచి సైతం భక్తుల రాక ప్రారంభమైంది.

ఏర్పాట్లు పూర్తి

ప్రతి ఏటా మూడు రోజులపాటు నిర్వహించే తిరునాళ్ల మహోత్సవాలు ఈ నెల 5,6,7 తేదీల్లో నిర్వహించనున్నారు. ఇందుకోసం ఇప్పటికే అవసరమైన ఏర్పాట్లు చేశారు. కొండపై గల చర్చితోపాటు దాని దిగువన ఉన్న మరియ తల్లి గృహాన్ని సైతం రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక దివ్య బలి పూజ కోసం సమస్తం సిద్ధం చేశారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి



ఈనెల 5వ తేదీ నుంచి జరగనున్న తిరునాళ్ల మహోత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతి ఏటా పెరుగుతున్న భక్తులను దృష్టిలో పెట్టుకొని ఈ ఏడాది కూడా భారీ అన్నదాన కార్యక్రమానికి ఏర్పాట్లు చేశాం. ముఖ్యంగా దూర ప్రాంతం నుంచి వచ్చే భక్తుల కోసం అవసరమైన ఏర్పాటు చేశాము.

– ఆంటోనీ రాజు, కమిటీ సభ్యుడు

ఆధ్యాత్మికతలో భాగమే



తిరునాళ్లను సైతం ఆధ్యాత్మికతలో భాగంగానే నిర్వహిస్తున్నాం. ఏటా మూడు రోజులపాటు ప్రత్యేక దివ్య బలి పూజలు, సువార్త కూడికలు, స్వస్థత ప్రార్థనలు దేవునికి మహిమ కరంగా జరుగుతాయి. ఎంతో మహిమాన్వితమైన శిలువగిరి తిరునాళ్ల మహోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని దేవుని ఆశీస్సులు పొందాలి.

– ఫాదర్ ఎం.ఫిలోమెన్ రాజు, విచారణ గురువు, శిలువగిరి

క్లుప్తంగా

యోగాతో సుఖప్రసవం



కొణకంచి(పెనుగంచిప్రోలు): యోగాసనాల వలన సుఖ ప్రసవం కలుగుతుందని వైద్యాధికారి కె.వాణి అన్నారు. శుక్రవారం గ్రామంలో ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారుగా 60 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులతో యోగాసనాలు చేయించడంతో పాటు మందులు అందజేశారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



నందిగామ: నగర పంచాయతీ పరిధిలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణ పరిధిలోని ఆరో వార్డులో శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలతో పాటు, ఫాగింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రైయిన్లలో దోమలు అధికంగా నివాసముంటున్న నేపథ్యంలో డ్రైయిన్లలో సైతం దోమల మందు పిచికారీ చేస్తున్నామన్నారు. ఇప్పటికే నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి దోమలు వ్యాప్తి చెందకుండా ఆయిల్ బాల్స్ వేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం దోమల బెడద ఉన్న నేపథ్యంలో పట్టణంలోని 20 వార్డుల్లో ఈ కార్యక్రమం కొనసాగిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట వార్డు కౌన్సిలర్ షేక్ యాకూబ్, వైఎస్సార్ సీపీ నాయకుడు అమీన్ పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



నందిగామ: పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 70 రామకోటి మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో నిత్యం స్వామికి విశేష పూజలు, అభిషేకాలను నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామికి విశేష పూజలు జరిగాయి. అనంతరం సీతారామచంద్రుల కల్యాణ కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది.

అంగన్‌వాడీ భవన నిర్మాణ పనుల పరిశీలన



పెనుగంచిప్రోలు: స్థానిక తుఫాన్ కాలనీలోని అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను శుక్రవారం ఎంపీపీ మార్కపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో భవనానికి కేవలం శ్లాబ్ వేసి వదిలి వేశారన్నారు. దీంతో అది నిరుపయోగంగా పడి ఉందన్నారు. మండల పరిషత్ నిధులు సుమారుగా రూ.7 లక్షలు వెచ్చించి భవనం మొత్తం ప్లాస్టింగ్, ఫ్లోరింగ్, టాయిలెట్స్, చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్నామన్నారు. కొద్ది రోజుల్లో పూర్తిగా ఉపయోగంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఏఓ సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

నేటితో ముగుస్తున్న ఈ-క్రాప్ నమోదు



పెనుగంచిప్రోలు: రైతులు సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ-క్రాప్ నమోదు శనివారంతో ముగుస్తుందని ఏఓ కె.రామసుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఈ రబీ సీజన్‌లో 2,560 ఎకరాల్లో వరి, 980 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. దీనికి సంబంధించి ఈ-క్రాప్ నమోదు దాదాపు పూర్తయిందన్నారు. అలాగే ఈకేవైసీ మండలంలో 96 శాతం పూర్తయిందన్నారు. ఈకేవైసీ చేయించుకోవాల్సిన రైతులు తక్షణం చేయించుకోవాలన్నారు.

అనిగండ్లపాడు సర్పంచ్‌కు సన్మానం



సన్మానం అందుకుంటున్న సర్పంచ్ జ్యోతి

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్, గ్రామీణ నీరు, పారిశుద్ధ్య శాఖ ద్వారా ఇంటింటికీ నీటి నిర్వహణ, యాజమాన్యం గురించి ప్రచారం చేసినందుకు శుక్రవారం గ్రామ సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మంను ఎంపిక చేసి సన్మానించారు. అనంతరం జలజీవన్ మిషన్ కార్యక్రమాలను వివరించారు. జలజీవన్ మిషన్‌లో సభ్యుల బాధ్యతలను వివరించారు. కార్యక్రమంలో జలజీవన్ మిషన్ జిల్లా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ రామకృష్ణ, హార్ట్ అమలు సహాయక సంస్థ కో-ఆర్డినేటర్ లక్ష్మీహారిక, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సదస్సు

జగ్గయ్యపేట అర్బన్: మహిళలంతా ఐక్యంగా ఉద్యమం చేస్తే తమ న్యాయమైన హక్కులను సాధించుకోవచ్చని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి అన్నారు. స్థానిక డీవీఆర్ నగర్‌లోని సుందరయ్య భవన్‌లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సు ఐద్వా మండల కార్యదర్శి దంతాల రాజేశ్వరి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి మాట్లాడుతూ 1910 లో అమెరికాలో మహిళలు పని ప్రదేశాలలో చాలా దుర్మార్గ పరిస్థితులు ఎదుర్కొన్నారన్నారు. ఆ పరిస్థితుల దృష్ట్యా మహిళల పోరాట ఫలితంగా హక్కులు సాధించుకున్నారని తెలిపారు. అప్పటి నుంచి మహిళా దినోత్సవం జరుపుకుంటున్నారని తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.కమల, ఐద్వా నాయకురాలు నాగమణి, రైతు సంఘం నాయకుడు కె.లింగారావు, వ్యవసాయ కార్మికసంఘం నేత కోట కృష్ణ, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, ప్రత్యూష, ఆశా వర్కర్లు సుధారాణి, వెంకటరమణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎలకమ్మ, రంగమ్మ, సీఐటీయూ మండల అధ్యక్షుడు షేక్ గౌస్‌మియా, ఎస్.రామనాథం పాల్గొన్నారు.

ప్రీతి నాయక్‌ను హింసించిన వారిని శిక్షించాలి



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న గోర్‌భాయ్ సేవాసంఘం సభ్యులు, బంజారా నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: డాక్టర్ ప్రీతి నాయక్‌ను హింసించిన వారిని కఠినంగా శిక్షించాలని గోర్‌భాయ్ సేవాసంఘం సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి స్థానిక రైతుబజారు ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద గోర్ భాయ్ సేవాసంఘం (లంబాడీ సంఘం) ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు లాహోరి బద్దూనాయక్ మాట్లాడుతూ ప్రీతి నాయక్‌ను హింసించిన కిరాతకులను కఠినంగా శిక్షించాలని, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా తెలంగాణా ప్రభుత్వం భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రీతి కుటుంబాన్ని ఆదుకోవాలని తెలిపారు. ఇలాంటి పరిస్థిలు దేశంలో ఎక్కడా రాకుండా ఆంధ్రప్రదేశ్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశా చట్టం తీసుకువచ్చినట్లుగా అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని సూచించారు. స్టీల్ ప్లాంట్, ఆర్టీసీ విభాగాలకు చెందిన బంజారా నాయకులు రిటైర్డ్ రిజిస్ట్రార్ బి.రాజునాయక్, బి.బద్యానాయక్, బి.కృష్ణానాయక్, బి.బాలాజీ తదితరులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

మధ్యాహ్న భోజనం రుచి, శుచిగా ఉండాలి



పుల్లూరు హైస్కూల్లో భోజనం చేస్తూ నాణ్యత పరిశీలిస్తున్న లక్ష్మీరెడ్డి, రేణుక తదితర

పుల్లూరు(మైలవరం): ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం రుచి, శుచిగా ఉండేట్లుగా తయారు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు ఈ.లక్ష్మీరెడ్డి తెలిపారు. మైలవరం మండలంలోని రేషన్ షాపులు, ప్రభుత్వ వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలలను ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి రేణుకతో కలిసి శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మైలవరం మండలం పుల్లూరు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. బియ్యం 55 కిలోలు వండినట్లు రికార్డుల్లో నమోదై ఉందని, కానీ ఆ పరిమాణంలో అన్నం కన్పించడం లేదన్నారు. భోజన పదార్థాలు బాగుంటే పిల్లలు స్కూల్లోనే తినేవారని, కానీ ఎక్కువ మంది విద్యార్థులు ఇంటి వద్ద నుంచే క్యారేజీలు తీసుకువస్తున్నట్లు కన్పిస్తోందన్నారు. చిక్కీలు ఇవ్వకపోవడాన్ని గుర్తించారు. వంట ఏజెన్సీలు పద్ధతులు మార్చుకోవాలని, భోజనంతో పాటే చిక్కీలు కూడా ఇవ్వాలన్నారు. మండలంలోని చంద్రగూడెం గ్రామంలో రేషన్ షాప్ నంబర్ 18 తనిఖీ చేసి రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. మైలవరంలోని ప్రభుత్వ వసతి గృహాన్ని సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నాం

కొండపర్వ(విస్సన్నపేట): గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పోషకవిలువలు కలిగిన ఆహారం అందిస్తున్నట్లు స్టేట్ ఫుడ్ కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి అన్నారు. మండలంలోని కొండపర్వ బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి రుక్మాంగదయ్య, తహసీల్దార్ కె.లక్ష్మి, పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత పాల్గొన్నారు.

ముగిసిన యోగా శిక్షణ తరగతులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): శ్రీవెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక బీ.కాలనీ ఆడిటోరియంలో గత నెల 23వ తేదీ నుంచి ప్రారంభమైన యోగా శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ట్రస్ట్ చైర్మన్ సురేష్‌బాబు మాట్లాడుతూ యోగా అంటే పిల్లల నుంచి వృద్ధుల వరకు కులమతాలకు అతీతంగా అందరూ ఆచరించదగిన జీవన విధానమన్నారు. యోగా గురువు లంకే జనార్దన్ మాట్లాడుతూ యోగా నిత్యజీవితంలో ఒక భాగం కావాలని సూచించారు.

రీ సర్వేతో కచ్చితమైన కొలతలు



పరిటాలలో సరిహద్దు రాళ్లను దగ్గరుండి పాతిస్తున్న తహసీల్దార్ రాజకుమారి

కంచికచర్ల: భూముల రీ సర్వేతో కచ్చితమైన కొలతలు, హద్దుల వస్తాయని, ఆ భూముల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన హద్దు సర్వేరాళ్లను పాతుతున్నామని రైతులు సహకరించాలని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి పేర్కొన్నారు. మండలంలోని పరిటాలలో శుక్రవారం జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా పభుత్వ, ప్రైవేటు భూములను రీ సర్వే చేసి ప్రభుత్వం పంపిణీ చేసిన సరిహద్దు రాళ్లను పాతారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు పొలానికి భూ హక్కు పత్రంతో హాజరుకావాలని కోరారు. స్టోన్ ప్లాంటేషన్ ఈ నెల 15వ తేదీలోగా సరిహద్దురాళ్లను పాతేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు, కౌలురైతులు తమ రెవెన్యూ, అధికారులు, సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆఫ్ సర్వేయర్ నంద్రు అనూష్‌కుమార్, డీటీ నాగుల్‌మీరా, ఆర్ఐ శిరీష, వీఆర్వోలు వేముల ప్రదక్షిణరావు, వేల్పుల జనార్దన్ పాల్గొన్నారు.

సాహితీ కళావేదిక నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, భక్తులు

పెనుగంచిప్రోలు: స్థానిక పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో ఉన్న శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో భక్తుల విరాళాలతో నిర్మించనున్న సాహితీ కళావేదిక నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ముందుగా పరాంకుశం నారాయణాచార్యులు, బాలకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కళావేదిక నిర్మాణానికి గ్రామానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు స్వామి గోపాలరావు దంపతులు రూ.1,11,116, యనమదల నాగేశ్వరరావు దంపతులు రూ.1,10,000, అనిగండ్లపాడు గ్రామానికి చెందిన కాశిన శ్రీనివాసరావు రూ.10,116 కార్యక్రమంలో భాగంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు కొమరగిరి రఘురామారావు, శ్రీతిరుపతమ్మవారి ఆలయ మాజీ చైర్మన్లు కాకాని శ్రీనివాసరావు, వాసిరెడ్డి బెనర్జీ, కర్ల వెంకటనారాయణ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ వేగినేటి గోపాలకృష్ణమూర్తి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన

పరిటాల(కంచికచర్ల): 'నా భర్తను అన్యాయంగా కంపెనీ యాజమాన్యం పొట్టనపెట్టుకుంది' అని మృతుడు హరికృష్ణ భార్య బోరున విలపించింది. మండలంలోని పరిటాల న్యూకాన్ ఇటుకల తయారీ కంపెనీ వద్ద శుక్రవారం మృతుడు హరికృష్ణ కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఈ నెల రెండో తేదీన న్యూకాన్ బ్రిక్స్ కంపెనీలో పనిచేస్తున్న పరిటాల గ్రామానికి చెందిన పాలంకి హరికృష్ణ గురువారం బాయిలర్‌లో పేరుకుపోయిన సిమెంట్‌ను తీసేందుకు దిగాడు. గమనించకుండా అదే ఇటుకల కంపెనీలో పనిచేసే మరొక వ్యక్తి స్విచ్ ఆన్ చేశాడు. దీంతో బాయిలర్‌లో ఉన్న వ్యక్తి మృతి చెందాడు. ఈ విషయం తన కుటుంబానికి, బంధువులకు కాని తెలియపర్చలేదని తమ కుటుంబానికి న్యాయం చేయాలని న్యూకాన్ బ్రిక్స్ కంపెనీ ప్రధాన ముఖ ద్వారా వద్ద నిరసన ప్రదర్శన చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న నందిగామ సీఐ ఐవీ నాగేంద్రకుమార్ ఆందోళనకారులను బయటకు వెళ్లాలని నచ్చజెప్పారు. గ్రామానికి చెందిన పెద్దలు వచ్చి కంపెనీ యాజమాన్యంతో చర్చలు జరిగి బాధితుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలని పట్టుపట్టడంతో కంపెనీ ప్రతినిధులు అంగీకరించారు. అనంతరం పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళన చేస్తున్న గ్రామస్తులను బయటకు పంపారు.

లాభదాయకంగా పెరటికోళ్ల పెంపకం

ఇబ్రహీంపట్నం: పెరటికోళ్ల పెంపకం డ్వాక్రా మహిళలకు లాభదాయకంగా ఉంటుందని ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న అన్నారు. ఇబ్రహీంపట్నం వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయం వద్ద డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు శుక్రవారం పెరటికోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పెరటికోళ్లు నాటుకోళ్ల మాదిరిగా మన పరిసరాలకు అనుగుణంగా పెరుగుతాయన్నారు. వీటి ద్వారా అదనపు ఆదాయం పొందొచ్చన్నారు. డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ లబ్ధిదారుల నుంచి 100 యూనిట్లు అర్జీలు రాగా వాటిలో 35 యూనిట్లు అందజేశామన్నారు. మిగిలిన యూనిట్లు త్వరలో అందిస్తామని తెలిపారు.

సాగర్ జలాలు విడుదల చేయాలి

ఎ.కొండూరు: సాగర్‌జలాలు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, రైతుల ఆధ్వర్యంలో విజయవాడ-జగదల్పూర్ జాతీయ రహదారిపై ఎ.కొండూరు మత్రియ తండా వద్ద శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ మండలంలోని జమలాపురం మేజర్ కాలువకు సాగర్ నీరు విడుదల చేసి ఎండుతున్న పంటలను కాపాడాలని కోరారు. ఎన్ఎస్‌పీ అధికారులు జమలాపురం మేజర్ కాలువకు సాగునీరు విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో పీపీ ఆంజనేయులు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జి.సీతారెడ్డి, రైతు సంఘ నాయకులు పి.ఆనందరావు, ఎ.అంబిరెడ్డి, ఎస్.రామకృష్ణారెడ్డి, సీఐటీయూ నాయకులు జట్టి వెంకటేశ్వరరావు, గొల్లమందల తండా సర్పంచ్ డి.రాముడు, రైతులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదం

ఇబ్రహీంపట్నం: పశ్చిమ ఇబ్రహీంపట్నంలోని ట్రక్ టెర్మినల్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించింది. అసలే ఎండలు ముదరడంతో ఎండిపోయిన చెట్లకు మంటలు అలుముకుని నిరుపయోగంగా ఉన్న దుకాణాలకు వ్యాపించాయి. దీంతో దుకాణాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. మద్యం మత్తులో ఆకతాయిలు చేసిన పనికి మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది.

వీఆర్వోలు అందుబాటులో ఉండాలి

వీరులపాడు: వీఆర్వోలు ఆయా గ్రామాలలోని రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దార్ ఆశయ్య నాయక్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల వీఆర్వోలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ముఖ్యంగా గ్రామాలలోని రైతుల వ్యవసాయ భూములకు సంబంధించి రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని తెలిపారు. అంతే కాకుండా ఎప్పటికప్పుడు రికార్డులను సక్రమంగా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. విధి నిర్వహణలో బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శివప్రసాద్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో అధికారుల విచారణ

పెనుగంచిప్రోలు: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో(పీహెచ్‌సీ) వైద్యాధికారి, సిబ్బందిపై ప్రజల నుంచి, వైద్య సిబ్బంది నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు శుక్రవారం డీఎల్ఓ ఉషారాణి విచారణ నిర్వహించారు. విచారణ వివరాలు వెల్లడించేందుకు ఆమె నిరాకరించారు. అందరి నుంచి లిఖిత పూర్వకంగా వివరాలు సేకరించడంతో పాటు వ్యక్తిగతంతగా వివరాలు తెలుసుకున్నారు.

హుండీ ఆదాయం రూ.91,162

భీమవరం(వత్సవాయి): గ్రామంలో వేంచేసియున్న మల్లికార్జునస్వామి ఆలయ హుండీని శుక్రవారం దేవదాయశాఖ నందిగామ ఇన్‌స్పెక్టర్ అనురాధ సమక్షంలో లెక్కింపు చేపట్టారు. శివరాత్రిని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన హుండీ వల్ల ఆలయానికి రూ.91,162 ఆదాయం వచ్చినట్లు ఈఓ సీహెచ్ హరిదుర్గానాగేశ్వరరావు తెలిపారు. ఈ నగదుతో ఆలయంలో పలు అభివృద్ధి పనులను చేపట్టేందుకు గ్రామస్తులతో చర్చించి, నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

పెంచిన గ్యాస్ ధరను ఉపసంహరించుకోవాలి

జగ్గయ్యపేట అర్బన్: కేంద్ర ప్రభుత్వం గృహ వినియోగానికి ఉపయోగించే ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధరను రూ.50, వాణిజ్య సిలిండర్ ధర రూ.350 పెంపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని బీఎస్పీ పేట నియోజకవర్గ ఇన్‌చార్జి కొదమల ప్రభుదాసు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ సబ్సిడీ జమలను రెండేళ్లుగా నిలిపివేసి గృహ వినియోగానికి సబ్సిడీ క్రింద ఇచ్చే సిలిండర్ల సంఖ్యను కుదించడం పూర్తిగా పేద, మధ్య తరగతి వారిపై దాడి తప్ప మరొకటి కాదన్నారు. పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు పవన్ కార్తీక్, టౌన్ ఇన్‌చార్జ్ బాషా పాల్గొన్నారు.

96 శాతం పింఛన్ల పంపిణీ



అనిగండ్లపాడులో పింఛన్ అందిస్తున్న వలంటీర్

పెనుగంచిప్రోలు: మండలంలో శుక్రవారంతో సామాజిక పింఛన్ల పంపిణీ 96 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్ తెలిపారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తెల్లవారు జాము నుంచే పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నారన్నారు.

గేదెలు, పొట్టేళ్ల యూనిట్లు ఏర్పాటుచేయాలి

గంపలగూడెం: స్వయం సహాయక సంఘాల మహిళలతో గేదెలు, పొట్టేళ్ల యూనిట్ల ఏర్పాటులో సిబ్బంది మండలానికి కేటాయించిన టార్గెట్లను వెంటనే పూర్తి చేయాలని డీఆర్డీఏ పీడీ ఎం.శ్రీనివాస్ తెలిపారు. గంపలగూడెం వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో శుక్రవారం వెలుగుమిత్రలు, గ్రామసమాఖ్య అధ్యక్షులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సంబంధిత యూనిట్ల ఏర్పాటులో మండలం పూర్తిగా వెనుకబడి ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనిట్ల ఏర్పాటుతో ఆ కుటుంబానికి ఒనగూరే ప్రయోజనాలను, ఆర్థిక వెసులుబాట్లపై సిబ్బంది మహిళల్లో అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. సమావేశానికి వైఎస్ఆర్ క్రాంతి పథం అనుబంధ శాఖల మండల అధికారులు హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పలు స్వయం సహాయక సంఘాలు, సీ, డీ గ్రేడులలో ఉండటాన్ని ఆయన తప్పు పట్టారు. సమావేశంలో ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి, వైఎస్ఆర్ క్రాంతి పథం ఏరియా కో ఆర్డినేటర్ యు.రాజేశ్వరి, ఏపీఎం నాగరాజు, మండల సమాఖ్య అధ్యక్షురాలు వెదురు లింగమ్మ, సీసీలు పాల్గొన్నారు.